
ఒక అబ్బాయిని
దత్తత తీసుకోవాలనే
ఆమె ఆలోచనని
సంఘం
ఎందుకు ఒప్పుకోలేదు?

# అడాప్షన్




వారం క్రితం పరీక్షలు పూర్తి చేసుకుని విశాఖలో తిరగాల్సిన ప్రదేశాలన్నీ చూసి పెట్టాబేడతో ఈస్ట్‌కోస్ట్ ఎక్కారు సమీర, దీప్తి. ఏ విషయంలోనూ సమీర, దీప్తి అభిప్రాయాలు కలవవు. కానీ రెండేళ్లుగా హాస్టల్‌లో ఒకే రూమ్‌లో వుంటూ ఇద్దరూ ఎంఎస్సీ పూర్తి చేసారు. ఇద్దరికీ ఒకరంటే ఒకరికి ఇష్టం. రైలులో ఎక్కి సీటు చూసుకున్నాక ఇద్దరూ గతం గురించి ఆలోచిస్తూ గుంటూరు స్టేషన్ చూసి ఉలిక్కిపడ్డారు.

"అరే అప్పుడే గుంటూరు వచ్చేసింది. పద పద దిగుదాం" హడావుడిగా అంది సమీర.

"అదిగో మా అన్నయ్య. దీప్తి మీ డ్రైవర్ వచ్చాడుగదా. వెళతావా మరి. మనము ఎలాగూ గుంటూరు వాళ్ళమే కదా. అప్పుడప్పుడు కలుసుకోవచ్చు. ఉంటామరి. బైబై"అంటూ వెళ్లిపోయింది సమీర.

డ్రైవర్ సామాను అంతా డిక్కీలో పెట్టాక ఇంటికి బయలుదేరింది. ఇంక మొదలు గొడవలు. నిర్లిప్తంగా అనుకుని వెనక్కి వాలింది దీప్తి. దీప్తి చాలా నెమ్మదస్తురాలు. సమీర ఒక తుఫాను. సమీర ఎప్పుడు ఉషారుగా నవ్వుతూ ఉంటుంది. తెలివైంది, అందమైనదీను.

"సమీరలాగా నేనెందుకు సంతోషంగా వుండను. నా ఆలోచనల్లో ఎప్పుడు నిరాసక్తి. నిర్లిప్తత ఎందుకు వుంటాయి. అమ్మనాన్నల ప్రేమ నేనెందుకు అర్థం చేసుకోను. నాకేదో కావాలి. అదేంటో నేనింతవరకూ తెలుసుకోలేకపోయాను" దీప్తి ఆలోచనలో వుండగా.



''అమ్మా ఇల్లు వచ్చింది దిగుతారా'' అడుగుతున్న డ్రైవర్ వంక చూసి నవ్వుతూ ''ఏమిటో ఆలోచనలో పడిపోయాను రంగన్నా'' అని దిగింది.

''అమ్మగారు మీటింగ్ ఉందని వెళ్లారండి. నాన్నగారేమో వరంగల్ వెళ్లారండి. సాయంత్రానికి వచ్చేస్తారు. మీరు స్నానమదీ చేస్తే భోజనం వడ్డిస్తాను' గడగడా చెప్పేసిం

ది రంగి.

"ఊ సర్లే"

సాయంత్రం ఆరు గంటలకి.

"ఏం దీప్తి ఎప్పుడు రావడం. పరీక్షలు అవి బాగా రాసావా. ఫస్ట్ రావాలి. ఈ వర ప్రసాద్ కూతురు అనిపించుకోవాలి. సరే నాకు కొంచెం పని వుంది. మీ మమ్మీ రాత్రి వచ్చేస్తుంది. ఇవాళ అనాథాశ్రమంలో పిల్లలకి ఏవో క్రికెట్ పోటీలు అవీను. అన్నం తినేసి పడుకో" వెళ్ళిపోయారు నాన్న.

రెండేళ్ళ ఎంసెట్లో రెండుసార్లు పడ్డింది దీప్తి. ఎందుకో ఇప్పుడు మరీ ఒంటరిగా అనిపిస్తుంది.

రెండురోజుల తరువాత సమీర ఫోన్ చేసింది.

"ఏమే ఫోన్ చెయ్యలేదు. అయినా నేను చాలా బిజీగా వున్నాలే. ఈ రెండేళ్ళ షాపింగ్ చెయ్యటం. నిన్న వెళ్ళి పాత ముత్యం సెట్టు మార్చి కొత్తది తీసుకున్నాను. ఇంకా అసక్తంగా మాట్లాడేస్తోంది.

ఏమిటో ఈ బంగారం, చీరలు ఇవేనా ఈ జీవితంలో ముఖ్యమైనవి. సమీరలో ఇంకా చిన్నతనం పోలేదేమో!

"రేపు వస్తున్నారు. అసలు నేను చెప్పేది వింటున్నావా" సమీర కొంచెం కోపంగా అడిగింది.

"ఆ ఆ! చెప్పు తల్లీ. నీ స్పీడ్కి తట్టుకోలేకుండా వున్నాను" నవ్వేసింది దీప్తి.

"అందుకని శనివారం ప్రొద్దున నువ్వు రా. పెళ్లివాళ్ళు పదిగంటలకి వస్తారుట. నాకు చాలా భయం వేస్తోందే దీప్తి. ప్లీజ్ నువ్వురా" సమీర గొంతులో అభ్యర్థన.

"ఓకే"

"ఓకే బై మరి ఉంటాను" ఫోన్ పెట్టేసింది.

"అయితే సమీర పెళ్లిచూపులు శనివారం. పెళ్లి చేసుకుని వెళ్లిపోతుంది. హాయిగా ఇల్లు, భర్త, పిల్లలు ఎంత మంచి ఊహ"

"ఏంటి ఒక్కదానివి నవ్వుకుంటున్నావు నీలో నువ్వు. ఎప్పుడొచ్చావు. పరీక్షలు అవీ బాగా రాసావా. చాలా చిరాకుగా వుంది. స్నానం చేసి వస్తాను" అమ్మ మాట్లాడుతూనే బెడ్రూంలోకి వెళ్లిపోయింది.

ముగ్గురికీ ఈ ఇల్లు చాలా పెద్దది. అందుకే పనివాళ్ల ముగ్గుర్ని పెట్టుకున్నారు ఇల్లు నిండుగా వుండడానికి.

భోజనాల దగ్గర "ఊ ఇప్పుడు చెప్పు ఏమిటి విశేషాలు" అమ్మ అడిగింది.

"సమీర పెళ్లి చూపులు శనివారం. నన్ను రమ్మంది తోడుగా" అంది దీప్తి.

"నీ ఈడు వాళ్ళందరికీ పెళ్లిళ్లు అవుతున్నాయి తల్లీ. మీ నాన్నకి బిజినెస్ తప్ప ఇంకేమీ పట్టదు. ఇవాళ రానీ గట్టిగా చెప్తాను" అమ్మ కోపంగా అంది.

"పెళ్లికి ఇప్పుడేమిటమ్మా తొందర"

"పెళ్లికొడుకు దొరకాలా మన స్థాయికి తగ్గ. లేకపోతే ఎవరో బికారిని తీసుకురావాల్సి వస్తుంది ఇంటికి"

"అదేమిటమ్మా నేను అలా చెప్పాల్సింది. చెప్పుకోవడమేమిటి" ఆశ్చర్యంగా అడిగింది దీప్తి.

"ఒక్కర్తే కూతురివి. నిన్నెలా పంపిస్తాననుకున్నావు? ఇల్లరికం తెచ్చుకోవాల్సింది.

నువ్వు మా దగ్గరే వుండాలి'' గర్వంగా అంది అమ్మ.

''పిచ్చి అమ్మ. ఈ ఇంట్లో వుండడం నాకిష్టం లేదంటే భరించగలదా. నాకంటూ చిన్న పొదరిల్లు. ప్రేమించే భర్త. పిల్లలు కావాలి అంతేకానీ వ్యక్తిత్వము లేని మొగుడు వద్దనేవద్దు. అదీ మా అమ్మ చెప్పినట్లు వినే వ్యక్తి వద్దు'' అదే చెప్పింది దీప్తి అమ్మతో. అమ్మ మండిపడింది.


''అవునవును. మేము పేదలాగా కనిపిస్తున్నాము ఇప్పుడు కదూ. ఎంత స్వార్థం నీకు. నీ కోసం జీవితం అంతా హారతి కర్పూరం లాగా అయిపోయింది. ఇప్పుడు మాకు తోడు అవసరం. అది తెలిసి మమ్మల్ని వీడిపోతానంటావా. ఛీ ఎంత స్వార్థం నీకు'' అమ్మ కోపంగా భోజనం చెయ్యకుండా పడుకుంది.

ఎలా చెప్పాలి అమ్మకి. ఎప్పుడూ మహిళా మండలి పేరుతో తిరిగే అమ్మ. బిజినెస్ పేరుతో తిరిగే నాన్న. నా కోసం ఏమి త్యాగం చేసారు వీళ్లు. ఆయాల చేతిలో పెరిగిన నేను వీళ్ళకోసం నా జీవితాన్ని ఎందుకు త్యాగం చేయాలి. నా జీవితం నాది అని వీళ్లెందుకు అర్థం చేసుకోరు. ఛ '' విసుగ్గా లేచింది దీప్తి.

శనివారం వెళ్లింది సమీర ఇంటికి దీప్తి. పెళ్లికొడుకు చాలా స్మార్ట్‌గా వున్నాడు. రెండు కుటుంబాలవారికి నచ్చడంతో తాంబూలాలు వరకూ వచ్చేసారు.

సమీర తరువాత చాలా ఉత్సాహంగా అందంగా కనిపించింది.

''దీప్తి నువ్వు కూడా పెళ్లి చేసుకుని అత్తగారింటికి వెళ్లు. కాదు కాదు మొగుడి దగ్గరికి వెళ్లు. జీవితంపట్ల నీకుండే నిరాసక్తత విసుగు పోతాయి. నీకు మార్పు కావాలి. నిన్నర్థం చేసుకోలేము అనుకున్నావు కదూ. నాకు తెల్సు నీ ఆలోచన్లు దీప్తి. నీకంటూ చిన్న ఇల్లు, నిన్ను అర్థం చేసుకునే భర్త, పిల్లలు కావాలి. నీకు నీ జీవితం మీద అధికారం కావాలి. అవి దొరుకుతాయి



పెళ్లిచేసుకో'' ఆశ్చర్యంగా చూస్తూ వుండిపోయింది దీప్తి. సమీర తన గురించి ఇంత ఆలోచిస్తోందా''

అమ్మ చెప్పిన విషయం చెప్పింది. ఎందుకనో ఇన్నాళ్లుగానో దాచుకున్న కన్నీళ్లు వచ్చేసాయి.

నెల తరువాత సమీర పెళ్లి అయిపోయింది. ఎందుకో నాలో సగ భాగం వెళ్లిపోయినట్లుగా వుంది. సమీర ఎంత మంచి పిల్ల మనసులో అనుకుంది దీప్తి.

మూడేళ్ల తరువాత గుంటూరు వచ్చింది సమీర. ఈ మధ్యలో సమీర భర్త రమేశ్ బిజినెస్ టూర్ల మీద విదేశాలకు వెళ్లవలసి రావడంతో సమీర కూడా అతనితోపాటు వెళ్లింది. సమీర, దీప్తిల మధ్య ఉత్తరాల నుంచి గ్రీటింగ్స్ కార్డ్స్ తరువాత అసలు కాంటాక్ట్స్ పోయాయి. సమీరకి ఒక కూతురు.

అందుకే సమీర చాలా ఉత్సాహంగా ఉంది మూడేళ్ళ తరువాత దీప్తిని కలుస్తానని.

"అమ్మా దీప్తి దగ్గరికి వెళ్తొస్తాను. అసలు ఎలా వుందో ఏమిటో. ఫోన్ కూడా చెయ్యడంలేదు. దానికి షాక్ ఇవ్వాలి'' నవ్వుతూ అంటున్న సమీర వంక చూసి

"ఛ దానింటికి ఎందుకు వెళతావు. దాని పేరు నా దగ్గర ఎత్తవద్దు. చదవి చదివి ఉన్న మతి చెడిందంటే ఇదే'' అమ్మ కోపంగా అంది.

"అదేమిటమ్మా అదేం చేసింది'' ఆశ్చర్యంగా అడిగింది సమీర.

"ఇంకా ఏం చెయ్యాలి. అది ఒక అబ్బాయిని దత్తు తీసుకుంది. ఇప్పుడేం ఖర్మ వచ్చిందని. వాళ్ళ అమ్మ వాళ్ల నడిపే అనాథ ఆశ్రమం నుంచి. ఆవిడ ఆయన తల ఎత్తుకు తిరగలేక ఇద్దరూ కాశ్మీర్ వెళ్లారు. ఛీ సిగ్గులేకపోతేసరి. అంతగా కొడుకు కావాలంటే పెళ్లి చేసుకుని కనొచ్చు కదా'' సమీర తల్లి రుక్మిణమ్మగారు కోపంగా అన్నారు.

సమీర చాలాసేపు ఆలోచనలో పడింది. ఏదో బలమైన కారణం లేకపోతే దీప్తిఇలా చెయ్యదు. అదేదో కనుక్కోవాలి. దీప్తి దగ్గరికి వెళ్లాలి. అదే చెప్పింది సమీర తన తల్లితో.

"సర్లే వెళ్లు. కానీ గంటలో వచ్చేయ్. దాని పిచ్చి ఆలోచనలు నీనెత్తికి ఎక్కిస్తుందేమో చూసుకో. జాగ్రత్త సుమా'' అమ్మ హెచ్చరించింది.

కారులో దీప్తి ఇంటికి బయలుదేరింది సమీర.

"దీప్తి'' గట్టిగా పిలుస్తూ లోపలికి అడుగుపెట్టిన సమీర ఆశ్చర్యపోయింది.

అక్కడ దీప్తి రెండేళ్ళ అబ్బాయితో నవ్వుతూ ఆడుకుంటోంది. దీప్తి ఇంత సంతోషంగా నవ్వుతూ వుండడం ఇదే మొదటిసారి సమీర చూడడం.

"హాయ్ సమీ. ఏంటి అక్కడే నుంచున్నావు. రా లోపలికి. ఎప్పుడొచ్చావు. రమేశ్ ఎలా వున్నాడు. నీ కూతురిని తీసుకురాలేదే'' గడగడా మాట్లాడేస్తున్న దీప్తి వంక సంభ్రమంగా చూస్తూ ఉండిపోయింది సమీర.

"నీలో ఎంత మార్పు దీప్తీ''

"ఇదంతా వీడి మూలానే. వీడు నా

కొడుకు దీపక్" గర్వంగా చెప్పింది దీప్తి.

"నువ్వు అప్పుడే పోలేదంటే నిన్నట్నుండే ఎవరో చెప్తున్నమాట. సర్లే కూర్చో కాఫీ తెస్తా" లోపలికి వెళ్లింది దీప్తి.

దీపక్ చాలా ముద్దొస్తున్నాడు.

కాఫీ తాగుతూ అడిగింది సమీర.

"ఇప్పుడు చెప్పు దీప్తి. వాడిని దత్తు తీసుకోవాల్సిన అవసరం ఏమిటి? పెళ్లి చేసుకోవచ్చు కదా. "

సమీర వంక చూసి నవ్వేసింది దీప్తి.

"అందరిలాగే నీకు వచ్చింది సందేహం. ఇంతవరకూ ఎవ్వరికీ చెప్పలేదు. కానీ నువ్వు అర్థం చేసుకుంటావని చెబుతున్నాను."

"నీకు తెల్సు నాకేం కావాలో" శూన్యంలోకి చూస్తూ చెప్పసాగింది దీప్తి.

"సమీ నాకంటూ ఒక చిన్న పొదరిల్లు కావాలి. నా మీద ప్రేమతో అధికారం చెలాయించే భర్త, నన్నర్థం చేసుకునే నావాళ్లు కావాలి. ఇది నాకు కావాలి అంటే అమ్మకి నేను స్వార్థపరురాలిగా కనిపించాను. ఇంట్లో ప్రారంభించిందని అప్పటినుంచి ఇప్పటికి జరిగే ఘర్షణలని భరించలేని అమ్మ రేపు నా భర్త వచ్చిన ఆ ఇష్టం వున్నట్లు ఉంటే భరించగలదా? అమ్మ చేతిలో నా భర్త ఒక కీలుబొమ్మలాగా నేను చూడలేను. నాకలాంటి వాడు వద్దు"

"ఒక విశిష్టమైన వ్యక్తిత్వము ఉండి నన్ను నా పిల్లల్ని జాగ్రత్తగా, ప్రేమగా చూసుకునే వ్యక్తి కావాలి. ఇది స్వార్థమా? నేను అనుకోవడంలేదు. ఇది నాకున్న ప్రాథమిక హక్కు. కాని ఈ సంవత్సరంలో అమ్మ, నాన్న చూసే ఇల్లరికపు అల్లుళ్ళ సంబంధాలు భరించలేక ఈ నిర్ణయానికి వచ్చాను. వాళ్ళకి ఈ వయస్సులో చూసుకోవడానికి వ్యక్తి కావాలి. అందుకే నేను ఎందుకు పెళ్లి చేసుకోవాలి. నేను చూసుకుంటానని చెప్పాను. పెళ్లి చేసుకుని నాకుండే ఈ కొంచెం స్వేచ్ఛ కూడా పోతుంది. ఇకపోతే దత్తు ఎందుకు తీసుకున్నానంటే నాకు తోడు కావాలి. నన్ను కూడా ప్రేమించే వ్యక్తి



## ఆపరేషన్!

పేషెంట్ డాక్టర్ని ఆశ్చర్యంగా అడిగాడు.
"మీరు చేసే ఆపరేషన్ థియేటర్లో నాకు మార్చురీలో ఎందుకు చేస్తారు?"
"ఆపరేషన్ థియేటర్ నుంచి మార్చురీకి డైరెక్టుగా తీసుకువెళ్ళడం కష్టం కనుక"
"...!?"

ఎ.ఉష్ణం (సికింద్రాబాద్)


కావాలి కదా అందుకే దత్తు తీసుకున్నాను. వీడిని నా ప్రేమతో పెంచుతున్నాను. స్వార్థంతో కాదు. వాడు వయస్సు వచ్చేవరకు నాతోనే వుంటాడు. అంటే ఇరవైఏళ్లు సుమారుగా అప్పటికి ఎలాగూ నేను పెద్దదాన్ని అవుతాను. వాడు నాదగ్గరే వుండాలనే స్వార్థం నాకులేదు. అందుకే దత్తు తీసుకున్నాను ఊపిరి తీసుకోవడానికి ఆగింది దీప్తి.

"చూడు సమీ ఒక అమ్మాయి పెళ్లి చేసుకున్న వారంరోజులకే నా భర్త నా ఇల్లు అంటూ భర్తని క్షణం విడిచి వుండదు. ముప్పది సంవత్సరాల అబ్బాయిని వారంరోజులలో అంతగా ప్రేమించిన అమ్మాయి నెల నిండని అబ్బాయిని ఎందుకు ప్రేమించదు. నా రక్తం కాదు అంటుంది. ఆ పరాయి యువకుడిలో మటుకు తన రక్తం వుందా? కొంచెం విమర్శనాత్మకంగా ఆలోచిస్తే ఎంత స్టుపిడ్ చూడు ఆ అమ్మాయి వాదన. ఈ అడాప్షన్ ఇండియాలో అంతగా ప్రచారంలోకి రాకపోవడం ఒక ఆడదాని ఆలోచన. సమాజం అంటే ఏమిటి? నువ్వు, నేనూ పక్కవాళ్ళు, ఇరుగువాళ్ళు ఒక్కసారి ఆ భయం అనే భూతాన్ని దాటు. అప్పుడు నీకేం కావాలో నువ్వు తెలుసుకోగలుగుతావు

ముప్పది సంవత్సరాల అబ్బాయి బదులు సంవత్సరం అబ్బాయిని దత్తు తీసుకున్నాను. ఇందులో నా తప్పు ఎంతవరకు" స్థిరంగా, ధైర్యంగా అడుగుతున్న దీప్తికి బదులు చెప్పలేక సమీర తల వంచుకుంది ఈ సమాజానికి ప్రతినిధిగా.

*

## నిజమైన ఫలం



యాపిల్‌లాగా, మామిడిలాగా కన్పడే వ్యవహరించే జీడిమామిడి ఫలం విచిత్ర ఆకారానికో కథ వుంది. బ్రహ్మదేవుడు సృష్టి చేస్తూ అలసి నిద్రపోతే సరస్వతి దేవి పసుపు కాషాయ మిశ్రమంలో పియర్‌లా వుండే ఒక పండు చేస్తుండగా బ్రహ్మదేవుడు కదిలాడు. ఆ హడావుడిలో ఆమె గింజని (టెంక)లోపల పెట్టడం మర్చిపోయి ఆ కాయ కొసన బులాకీలా తగిలించింది. వేలాడే యాపిల్‌లా భ్రమింపచేసే జీడిమామిడి పువ్వు కాండ భాగం. నిజమైన ఫలం వ్రేలాడే ఇందులోంచే మనకి జీడిపప్పు లభిస్తుంది. బ్రెజిల్ నుంచి మన దేశానికి వచ్చింది, పోర్చుగీసువారు దీన్ని కాజూ అని పిల్చి మన దేశంలో నాటారు. దీన్ని పోర్చుగీసువారు మాంగో అని కూడా అంటారు. గోవాలో దీనినుండి సారా తయారు చేసే వారట. పోర్చుగీసు వారు. పైకాయతో జామ్ తయారు చేసేవారట.

—అమ్మయని రాజ్యశ్రీ